'పల్లా'ను కలిసిన 'రేవూరి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌ను టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ బలోపేతంలో యువకుల పాత్ర ఎంతో ఉందని పల్లా శ్రీనివాస్ అన్నారని తెలిపారు. టిఎన్ఎస్ఎఫ్‌ను రాష్ట్ర వ్యాప్తంగా బలోపేతం చేయాలని తెలిపారు. టిఎన్ఎస్ఎఫ్ విద్యార్థులకు, రాష్ట్ర ప్రభుత్వానికి వారధిలా ఉండాలని సూచించినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో పెట్టిన అక్రమ కేసులను త్వరలోనే తీస్తామని హామీ ఇచ్చినట్లు తెలియజేశారు.

పల్లా శ్రీనివాస్‌తో రేవూరి వేణుగోపాల్

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మున్సిపాలిటీలో బదిలీ అయిన కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పురపాలక కార్యాలయంలో మున్సిపల్ కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ప్రతి నెలా 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమ్మె కాలంలో 16 రోజుల వేతనం ఇవ్వాలని తెలిపారు. కార్మికులకు మెడికల్ బిల్లు అమలు చేయాలని పేర్కొన్నారు. ఇపిఎఫ్, ఇఎస్ఐ ఏస్థితిలో ఉందో తెలియజేయాలని కోరారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే బదిలీ కార్మికులకు మూడు నెలల నుంచి వేతనాలు రాలేదని విమర్శించారు. అధికారులు నిర్లక్ష్యం వీడి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.రమణ, ప్రసాద్, సాలమ్మ, సురేష్, ప్రమీల, పెంచలయ్య, రెడ్డయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చిట్వేలి రవికుమార్

పేదల సొంతింటి కలను నెరవేర్చాలి : జెసి

జెసిని సన్మానిస్తున్న హౌసింగ్ అధికారులు

ప్రజాశక్తి-రాయచోటి

హౌసింగ్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి పేదల సొంతింటి కలను నెరవేర్చాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో గృహ నిర్మాణ సంస్థ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిరుపేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయడంతో పాటు నిరుపేదల సొంతింటి కల నెరవేర్చే దిశలో హౌసింగ్ అధికారులు పనిచేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఏర్పడి 46 సంవత్సరాలు పూర్తయి రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్ డేను నిర్వహించడం సంతోషదాయకమన్నారు. గృహ నిర్మాణ సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఒక్క ఉద్యోగి చిత్తశుద్ధితో విధులు నిర్వహించి ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు సాధించిన ప్రగతిని అభినందిస్తూ ఇదే స్ఫూర్తితో ప్రస్తుతం ప్రభుత్వం కేటాయించిన 100 రోజుల లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లాలో పనిచేయుచున్న హౌసింగ్ సిబ్బందిని ఆదేశించారు. రాబోయే రోజులలో గృహ నిర్మాణ సంస్థ మరింత ప్రగతిని సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా హౌసింగ్ అధికారులు, సిబ్బంది కేక్ కట్ చేసి జాయింట్ కలెక్టర్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శివయ్య, హౌసింగ్ డిఇలు, ఎఇలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి : డిఇఒ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యాప్రమాణాలు ఉండాలని డిఇఒ శివప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని రామారావు కాలనీలో ఉన్న బాపూజీ పురపాలక ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేసి సంతృప్తిని వ్యక్తపరిచారు. 9, 10వ తరగతుల విద్యార్థుల క్లాస్ రూమ్‌లను సందర్శించి ఉపాధ్యాయుల విద్యా బోధనను పర్యవేక్షించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను చూసి అన్ని సబ్జెక్టుల సిలబస్ పాఠ్య ప్రణాళికల ప్రకారం ఎంత వరకు పూర్తి చేశారో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సబ్జెక్ట్స్‌లో పిల్లలను ప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు. పాఠశాలలోని ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించేలా తీర్చి దిద్దాలని ఆ స్థాయిలో విద్యా బోధన ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నత స్థాయిలో విద్యా ప్రమాణాలు కొనసాగించాలన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు నాణ్యమైన విద్యను అందించి వారి భవిష్యత్తు కు తోడ్పాటును అందించాలని పేర్కొన్నారు. రాబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో మెరుగైన ఫలితాలు సాధించేలా కష్టపడి, ఇష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల నిర్వహణపై సంతృప్తిని వ్యక్తం చేశారు. డిఇఒతో పాటు పాఠశాల హెచ్ఎం రఘు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉపాధ్యాయులతో సమావేశమైన డిఇఒ శివప్రకాష్‌రెడ్డి

సహకార సంఘాలతో సుస్థిర అభివృద్ధి

- జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మెరుగైన భవిష్యత్తు నిర్మించడానికి సహకార సంఘాలే పునాదులని, జిల్లాలో సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. ఈ నెల 6న 102వ అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్లోని తన చాంబర్‌లో అధికారులతో కలిసి అంతర్జాతీయ సహకార దినోత్సవం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వ మానవాళి ఉజ్వల భవిష్యత్తు నిర్మాణంలో సహకార సంఘాలు అనే నినాదంతో అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని జరుపుతున్నట్లు పేర్కొన్నారు. 2030 నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అమలు చేయడానికి చర్యలను వేగవంతం చేయడం, స్థిరమైన భవిష్యత్తును నిర్మించడంలో ప్రస్తుత మరియు చారిత్రక సహకారాన్ని ప్రదర్శించడానికి సహకార సంస్థలకు అవకాశం ఉందన్నారు. సమాజంలో సామాజిక, ఆర్థిక, పర్యావరణ ప్రభావాన్ని సృష్టించి సామర్థ్యాన్ని పెంపొందించడంలో సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయని మెరుగైన భవిష్యత్తు నిర్మించడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి గురుప్రకాష్ రావు, జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారి లక్ష్మీపతి, ప్రొద్దుటూరు సిటిసి ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, సహకార శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మన్‌ఖాన్

16 నుంచి తాళ్లపాక సిద్ధేశ్వరస్వామి

వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తాళ్లపాకలోని సిద్ధేశ్వరస్వామి దేవాలయం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు స్వయంగా అర్చించి, పూజించిన శ్రీచెన్నకేశవస్వామి, శ్రీసిద్ధేశ్వర స్వామి వార్ల వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ పర్యవేక్షణ అధికారి బాలాజీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెన్నకేశవస్వామి, సిద్ధేశ్వరస్వామి వార్ల ఆలయాలలో ఈ వేడుకలు వేర్వేరుగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 16వ తేదీ సాయంత్రం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నిర్వహిస్తారని తెలిపారు. ఈ రెండు దేవాలయాలలో 10 రోజులపాటు ఉదయం, సాయంత్రం వేళల్లో వివిధ రకాల వాహన సేవలు నిర్వహించనున్నామని చెప్పారు. శ్రీచెన్నకేశవ స్వామి ఆలయంలో 17న ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం శేష వాహనం, 18న ఉదయం పల్లకి సేవ, సాయంత్రం హంస వాహనం, 19 ఉదయం పల్లకీ సేవ, సాయంత్రం సింహ వాహనం, 20న ఉదయం పల్లకీ సేవ, సాయంత్రం హనుమంత వాహనం, 21న ఉదయం మోహినీ అవతారం, సాయంత్రం గరుడ వాహన సేవలు ఉంటాయన్నారు. 22న సాయంత్రం 6 గంటల నుంచి శ్రీచెన్నకేశవ స్వామి, శ్రీసిద్ధేశ్వర స్వామి వార్ల ఆర్జిత కల్యాణోత్సవం, అనంతరం గజవాహన సేవ నిర్వహిస్తారన్నారు. 23వ తేదీ సాయంత్రం రథోత్సవం, 24న సాయంత్రం అశ్వవాహన సేవలు ఉంటాయన్నారు. 25న ఉదయం చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణం, 27న ఉదయం స్నపన తిరుమంజనం, సాయంత్రం పుష్పయాగాలు ఉంటాయన్నారు. శ్రీసిద్ధేశ్వర స్వామి వారి ఆలయంలో 17న ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం హంస వాహనం, 18 న ఉదయం పల్లకీ సేవ, సాయంత్రం చంద్రప్రభ వాహన సేవ, 19 ఉదయం పల్లకీ సేవ, సాయంత్రం చిన్నశేష వాహనం, 20 న ఉదయం పల్లకీ సేవ, సాయంత్రం సింహ వాహనం, 21న ఉదయం పల్లకి సేవ, సాయంత్రం నంది వాహనం, 22న సాయంత్రం 6 గంటలకు ఆర్జిత కల్యాణోత్సవం, గజ వాహన సేవలు, 23న సాయంత్రం పల్లకీ సేవ 24న సాయంత్రం పార్వేట ఉత్సవం, 25న ఉదయం వసంతోత్సవం, త్రిశూల స్నానం, సాయంత్రం ధ్వజావరోహణం, 26న ఉదయం స్నపన తిరుమంజనం, సాయంత్రం పుష్పయాగములతో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయని వివరించారు. భక్తులు విరివిగా బ్రహ్మోత్సవాల్లో పాల్గొని చెన్నకేశవ స్వామి, సిద్ధేశ్వర స్వామి కరుణాకటాక్ష వీక్షణాలకు పాత్రులు కావాలని కోరారు.

'రాహుల్‌పై అసత్య ప్రచారాలు మానుకోవాలి'

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

బిజెపి నేతలు రాహుల్‌గాంధీపై అసత్య ప్రచారాలు మానుకోవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు అమీర్ అన్నారు. శుక్రవారం తమ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ సభకు ప్రధాని మోడీ తప్పుడు సమాచారాన్ని ఇస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగానికి అనుకూలం ఎవరో, వ్యతిరేకులు ఎవరో దీనిని బట్టి తెలుస్తుందని చెప్పారు. ఒక రాజ్యాంగంలో భారతీయత లేదంటూ 1950లోనే ఆర్ఎస్ఎస్ చెప్పిందని అలాంటి సంస్థ నుంచి ఉద్భవించిన బిజెపి నేతల మాటలు ఎవరూ నమ్మే పరిస్థితుల్లో లేరని ప్రజలంతా రాహుల్‌గాంధీ వైపే ఉన్నారని పేర్కొన్నారు. తాము హిందువులమని చెప్పుకుంటూ 24 గంటలు విద్వేషం, హింస, అసత్యాలను ప్రచారం చేస్తున్న వాళ్లు హిందువులే కాదని చెప్పడం కూడా నేరమా?. దీన్ని వక్రీభవించి ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఇలాంటి ప్రచారం చేయడం మానుకుంటే మంచిదన్నారు. రాహుల్ గాంధీ డరోమత్ డరామత్ అంటూ ఇచ్చిన నినాదం సామాన్య ప్రజల్లో కూడా బలమైన చైతన్యం కలిగించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఖాదర్‌ఖాన్, షేక్ అమిర్ భాష, చాన్ భాష, షేక్ నూరుల్లా, సద్దాం, అంజద్, బాబా సర్దార్, ఓవైజ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు అమీర్

పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఎమ్మెల్యే చొరవతో తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చొరవతో పట్టణంలోని 14వ వార్డులో నెల కొన్న మంచినీటి సమస్య పరిష్కారమైంది. ఈ సందర్భంగా టిడిపి నాయకులు నాగూర్ వల్లి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు ఇష్టానుసారం తమ నివాసాలకు పైపు లైన్లు వేసుకోవడంతో స్థానిక ప్రజలకు మంచినీరు అందక తీవ్ర ఇబ్బంది పడ్డారన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన వెంటనే సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారన్నారు. మున్సిపల్ అధికారులు పరిశీలించి ఎత్తు ప్రదేశం నుంచి వార్డులోకి నీళ్లు వచ్చేవిధంగా పైపులైన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శుక్రవారం తానే వార్డులో పర్యటించి మంచినీటి ఏర్పాటు పనులను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు వేరుకాదని, ప్రజలకు మంచి చేయడానికే తొలి ప్రాధాన్యత నిస్తామని స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్లుగా నెలకొని ఉన్న మంచినీటి సమస్యను ఎమ్మెల్యేతో మాట్లాడి పరిష్కరించిన నాగూర్‌కువార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

చేపల వేట నిషేధం

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

సోమశిల వెనుక జలాలు, వెలిగల్లు రిజర్వాయర్‌లలో నిర్వహించే అన్ని రకాల చేపల వేటను ఈ నెల ఒకటవ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు (62 రోజులు) నిషేదించినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి సుస్మిత పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ జిల్లాలోని మత్స్యకారులు లైసెన్స్ ద్వారా చేపలు పట్టేందుకు ఆయా రోజుల్లో నిషేధం విధించామన్నారు. నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మన చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి డాక్టర్ శ్రీవిద్య అన్నారు. శుక్రవారం మండలంలోని చారావాండ్లపల్లిలో డెంగీ, డయేరియాపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, దోమ తెరలను వాడాలని సూచించారు. డయేరియాపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుధాకర్, ముజీబ్‌బాషా, సౌజన్య, నిర్మల, సుజాత పాల్గొన్నారు.

డయేరియా, డెంగీపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీవిద్య

నేడు జిల్లాకు మంత్రి మండిపల్లి రాక

ప్రజాశక్తి-రాయచోటి

రవాణా, యువజన, క్రీడల శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం జిల్లాకు రానున్నారని అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం ఆరు గంటలకు విజయవాడలో బయలుదేరి రోడ్డు మార్గాన నెల్లూరు జిల్లా కావలి మీదుగా మధ్యాహ్నం 1.30 అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని మంత్రి కార్యాలయానికి చేరుకుంటారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఈ మేరకు స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొననున్నారు.

అభివృద్ధే అజెండాగా ముందుకెళదాం : 'నల్లారి'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

తనకు ఓట్లు వేసి గెలిపించిన పీలేరు నియోజకవర్గం, వాల్మీకిపురం మండలంలోని ప్రజల రుణాన్ని తీర్చుకుంటానని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే హోదాలో తొలిసారి వాల్మీకిపురంకు వచ్చారు. ఈ సందర్భంగా వాల్మీకిపురం మండల పొలిమేర్ల నుంచి గండబోయనపల్లి, చింతపర్తి, విఠలం, పునుగుపల్లి, కొత్తఇందిరమ్మ కాలనీ మీదగా వాల్మీకిపురం వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తూ.. అడుగడుగునా పూలు చల్లుతూ, కర్పూర హారతులతో మహిళలు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో టిడిపి నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించి, ప్రసంగించారు. మండలాలు, నియోజకవర్గ అభివృద్ధే అజెండాగా ముందుకెళ్దామన్నారు. గ్రామస్థాయిలో టిడిపి నాయకులు ఎవ్వరూ ఇతర పార్టీల నాయకులను వేధించవద్దని, తాము ఎవ్వరినీ వేధింపులకు గురి చేయదలచుకోలేదన్నారు. గత ఐదేళ్లలో వైసిపి నాయకులు చేసిన తప్పులు మనం ఎవ్వరూ చేయకూడదని పేర్కొన్నారు. గతంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో వైసిపి నాయకులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, నామినేషన్ పత్రాలను చింపేసి ఏకగ్రీవంగా సర్పంచ్‌లు, జడ్‌పిటిలు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లను నియమించుకున్నారని పేర్కొన్నారు. తాము మాత్రం అలా చేయబోమని తెలిపారు. ప్రజాస్వామ్య బద్ధంగానే రాబోవు స్థానిక ఎన్నికల్లో ప్రజల మద్దతుతోనే నిజాయితీగా గెలిచి చూపిస్తామని పేర్కొన్నారు. అనంతరం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో కొంత మంది అధికారులు వైసిపి నాయకులకు మద్దతుగా పని చేశారని, మండల అభివృద్ధి గాలికి వదిలేశారన్నారు. కార్యక్రమంలో గాంధీపేట రమణ, మల్లికార్జున రెడ్డి, వల్లిగట్ల వెంకట్రమణ, క్రిష్ణారెడ్డి, కంభం నిరంజన్ రెడ్డి, రాజేంద్రాచారి, పివి నారాయణ, దినేష్ రాయల్, నరేంద్ర రెడ్డి, చంద్రమౌళి, సయ్యద్‌బాషా, శేషాద్రిరెడ్డి, ఖలందర్, సురేంద్ర వర్మ, బొక్కసం రామక్రిష్ణ, ఆనంద, సైదు, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త షామీర్‌తో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

కార్యకర్తకు 'గడికోట' పరామర్శ

ప్రజాశక్తి-రాయచోటి టౌన్ : సంబేపల్లె మండలం రౌతుకుంట గ్రామం దిన్నెమీదపల్లెకు చెందిన వైసిపి కార్యకర్త షామీర్ ఇటీవల టిడిపి వారి దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి పొందుచున్నారు. శుక్రవారం దిన్నెమీదపల్లెకు మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డితో కలసి వైసిపి జిల్లా అధ్యక్షులు గడికోట శ్రీకాంత్‌రెడ్డి వెళ్లి గాయపడిన కార్యకర్తను పరామర్శించారు. దాడి జరిగిన సంఘటనను అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలుకు తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ హసీనా నూర్ అహమ్మద్, ఎంపిటిసి భద్రయ్య, మాజీ సర్పంచ్ బయన్న, నాయకులు వంగిమల్ల వేణుగోపాల్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, జయరామిరెడ్డి, యర్రమరెడ్డి, మహాదేవరెడ్డి, అలీ, రంగారెడ్డి, అమరనాథరెడ్డి, వెంకటేశ్వర్లు, అల్తాఫ్, ఆదెయ్య, ఈశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజారెడ్డి, పెద్ద అయ్యవారయ్య, చిన్న అయ్యవారయ్య, నూగూరి వలీ, ఖాదర్ బాష పాల్గొన్నారు.

మతగురువు సర్కాజీని....: రాయచోటికి చెందిన మత గురువు, సర్కాజీ షర్ఫుద్దీన్ సాహెబ్ ఇటీవల గుండె సంబంధిత చికిత్స చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి పొందుచున్నారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషతో కలసి శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులనడిగి తెలుసు కున్నారు. త్వరితగతిన ఆరోగ్య వంతుడవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొలిమి హారూన్ బాష, నియామత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు వితరణ

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటి వృక్ష రక్షణ సమితి వ్యవస్థాపకులు తులసిరెడ్డి కుమారుడు క్రాంతి కుమార్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని భవిత (వికలాంగులు) స్కూల్‌లో మానవత లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్లేట్లు గ్లాసులు, పండ్లు, కిడ్స్‌తో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మానవత శాఖ అధ్యక్షులు గూడూరు ఖధర్ బాష, సెక్రటరీ అంకం జయచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు గంగాధర్ నాయుడు, చైర్మన్ అరమాటి శివగంగారెడ్డి, గౌరవ అధ్యక్షులు వెంకటరమణ, కో-చైర్మన్ షకీల్, లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ వ్యవస్థాపకులు, జిల్లా జిఎల్‌టి కో-ఆర్డినేటర్ లయన్ హరినాద్‌రెడ్డి, ఫాస్ట్ రిజన్ చైర్మన్ నారాయణరెడ్డితో పాటు సమిళిత ఉపాధ్యాయులు త్రిలోక్, జనార్దన్, సిబ్బందితో కలిసి విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, కిడ్స్‌లను అందజేశారు. అనంతరం విద్యార్థులకు అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రాంతికుమార్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని వికలాంగుల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. తమ కుమారుడి పుట్టినరోజు సందర్భంగా మానవత లైన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం చేయడం నా పూర్వజన్మ సుకృతమని తులసిరెడ్డి తెలియజేశారు. ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తానన్నారు. కార్యక్రమంలో మానవత కోశాధికారి మురళీమోహన్, సభ్యులు సయ్యద్ అష్రఫ్ అలీ, షేక్ అల్లా బకాష్, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి ప్లేట్లు, గ్లాసులు ఇస్తున్న దాత తులసిరెడ్డి

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం : విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి, పుట్టిన ఊరికి, చదువుకున్న పాఠశాలకు, జన్మనిచ్చిన తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎంఈవో వెంకటలక్ష్మీ అన్నారు. మండలంలోని చింతపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో 2023-24 ఏడాది పదవ తరగతి చదివి ఉత్తమ మార్కులు సాధించి, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు శుక్రవారం ప్రోత్సాహక బహుమతులను విశ్రాంత అధ్యాపకులు గోవింద రెడ్డి అందజేశారు. కీర్తన, మిస్బ, హన్సికలకు నగదు బహుమతిని ప్రోత్సాహికంగా అందజేసినట్లు దాత గోవింద రెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో నారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఐ అబ్దుల్ జహీర్, నందాయాదవ్

క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలి

ప్రజాశక్తి-నందలూరు

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని కలిగి జయాప జయాలను సమానంగా స్వీకరించాలని ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ పేర్కొన్నారు. నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ, అరవపల్లిలోని నందలూరు జడ్‌పి హైస్కూల్ క్రీడా మైదానంలో దివంగత తుంటి యానాదయ్య, సరోజమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు తుంటి నందాయాదవ్ ఆధ్వర్యంలో నందలూరు ప్రీమియర్ లీగ్ 9వ సీజన్‌ను ఏర్పాటు చేశారు. నందలూరు, ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాల స్థాయి హార్డ్‌టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్, నందా యాదవ్‌లు ప్రారంభించారు. ఆర్గనైజర్ పల్లె గ్రీష్మంత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన వారికి మొదటి బహుమతి కింద రూ.40వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.25వేలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు ముమ్మడిశెట్టి సుధాకర్, శివకోటి, మున్నా, రంజిత్, పుత్త శంకర, లయన్ కుర్రామణి యాదవ్, మేస్త్రి నరేంద్ర, ట్రైలర్ బాబు, నాగరాజు క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

గుండెపోటుతో విఆర్‌ఒ మృతి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

విఆర్‌ఒ ముజీబ్(ఫైల్ ఫొటో)

కురబలకోట మండలం, మట్లివారిపల్లె విఆర్‌ఒగా విధులు నిర్వహిస్తున్న ముజీబ్ శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. మదనపల్లె కురవంకలో నివాసముంటున్న ముజీబ్ ఉదయం విధులకు హాజరయ్యేందుకు సిద్ధమవు తుండగా అకస్మాత్తుగా గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు. హుటాహుటిన ఆయనను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారని చెప్పారు. విఆర్‌ఒ అకస్మాత్తుగా గుండపోటుతో మృతి చెందడంతో కురబలకోట రెవెన్యూ ఉద్యోగులు దిగ్భ్రాంతికి గురయ్యారు.ముజీబ్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

బురదమయంగా ఉన్న రోడ్డు

అధ్వానంగా దిగువగొల్లవాండ్లపల్లె రోడ్డు

- ఇబ్బందులకు గురతున్న వాహనదారులు

ప్రజాశక్తి-సుండుపల్లె

మండలంలోని సుండుపల్లె గ్రామ పంచాయతీలో దిగువగొల్లవాండ్లపల్లెలో రాయచోటి-సుండుపల్లె మెయిన్ రోడ్డులో రవాణా శాఖ అధికారులు గతంలో సిమెంట్ రోడ్డు వేశారని గ్రామ ప్రజలు తెలిపారు. ఆ రోడ్డు గుంతలమయంగా ఉండడంతో వర్షం వచ్చినప్పుడు నీరు నిండిపోయి వాహనా దారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వర్షం వచ్చిన ప్పుడు ఆ దారిలో వెళ్ళాలంటే వాహన దారులు ఆందోళన చెందుతు న్నారు. వాహనం అదుపుతప్పి కిందపడే ప్రమాదముందని చెబుతున్నారు. రాయచోటి- సుండుపల్లె ప్రధాన రహదారి కావడంతో ప్రతినిత్యం రాజకీయ నాయకులు, మండలాధికారులు, జిల్లా అధికారులు వాహనాలు తిరుగుతూనే ఉంటారని ఎవ్వరూ కూడా స్పందించక పోవడం శోచనీయమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దిగు గొల్లవాండ్లపల్లెలోని ప్రధాన రహదారికి మరమ్మతులు చేసి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

టీకాతోనే రేబిస్ దూరం

ప్రజాశక్తి-కలికిరి

టీకాల వేయించడం ద్వారా రేబిస్ వ్యాధిని దూరం చేయవచ్చునని బస్సు సంచాలకులు డాక్టర్ నాగమణి నాయుడు తెలిపారు. శనివారం ప్రాంతీయ పశు వైద్య శాల, కలికిరిలో పశు వైద్య కేంద్రాలు మేడికుర్తి, పాలెం, మహల్‌లో జోనోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కలకు రేబిస్ (పిచ్చికుక్క వ్యాధి) టీకాలు ఉచితంగా వేశారు. జంతువులు నుంచి మనుషులు కు వచ్చే వ్యాధులు పైన అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు. పెంపుడు కుక్కలను పెంచుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

8న పుంగనూరులో జాబ్‌మేళా

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

పుంగనూరు ప్రభుత్వ ఐటిఐలో 8న సోమవారం జాబ్‌మేళా జరుగుతుందని ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పుంగనూరు తంబళ్లపల్లిలో ప్రభుత్వ ఐటిఐలో శిక్షణ పొందుతున్న వారితో పాటు ఎస్ఎస్‌సి, ఇంటర్ ,డిగ్రీ అభ్యర్థులు హాజరుకావాలని కోరారు. సోమవారం ఉదయం 10 గంటలకు క్యాంపస్ రిక్రూట్మెంట్ జాబ్ మేళా జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ బయోడేటాతో పాటు విద్యార్హత ధృవపత్రాలు, ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు తమ వెంట తీసుకురావాలని సూచించారు. ఈ జాబ్ మేళాకు బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ నుంచి ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని, ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

9న సింహాద్రిపురం మండల సమావేశం

ప్రజాశక్తి-సింహాద్రిపురం

ఈనెల 9న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సాల్మాన్‌రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ మండల సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షులు అరుణ అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలన్నారు. ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

మురుగు కాలువల్లో పూడికతీత

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

కాలువల్లో పూడికను తీస్తున్న కార్మికులు

స్థానిక నగర పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారుల వెంబడి ఉన్న డ్రెయినేజీలలో శుక్రవారం పూడికల తొలగింపు పనులు చేపట్టారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో డ్రెయినేజీ కాలు వలలో ఉన్న పూడికలు తొలగిం చాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆదేశించడంతో నగర పంచా యతీ అధికారులు శుక్రవారం పనుల ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా ప్రధాన కాలువల్లోని పూడికలు తొలగించని కారణంగా మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతూ ప్రజలకు ఇబ్బందికరంగా ఉండేది. డ్రైనేజీ కాలువలోని పూడిక తొలగింపు పనులను మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, కమిషనర్ రామకృష్ణయ్య, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మధుకుమార్ దగ్గరుండి పర్యవేక్షించారు. వేంపల్లి రోడ్డు లోని ప్రధాన డ్రెయినేజీ కాలువ అసంపూర్తిగా ఉండడంతో ఊరి చివరనున్న స్థలాల్లో నీరు చేరేదని, శాశ్వత పరిష్కారం దిశగా దొండపాడు రస్తాలోని ప్రధాన కాలువకు అనుసంధానం చేసేలా నగర పంచాయతీ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

రింగుల బ్రిడ్జి వద్దు.. హైవే వంతెన కావాలి

ప్రజాశక్తి-వీరబల్లి

మండల పరిధిలోని డి.రాచపల్లి పంచాయతీ మాండవ్యనది పైన పుల్లగూర గండివద్ద రింగుల బ్రిడ్జికి పనులు చేపడుతున్నారని, రింగ్ బ్రిడ్జి వద్దని హైవే బ్రిడ్జిని నిర్మించాలని గ్రామస్తులు పనులను అడ్డుకున్నారు. గత ప్రభుత్వంలో రూ.7.85లక్షలతో మంజూరైన హైవే బ్రిడ్జిని పనులను ఇప్పుడు అదే బడ్జెట్‌తో కాంట్రాక్టర్ రింగులు వేసి బ్రిడ్జి కడదామని పనులు మొదలు పెట్టడం కాదని అన్నారు. గతంలో పోలోలపల్లి దగ్గర ఒకరు రింగుల బ్రిడ్జి, పెద్దూరు కస్పా దగ్గర బ్రిడ్జి, పెద్దివిడి దగ్గర ఒక బ్రిడ్జి, ఆమూరు వానపల్లి దగ్గర ఒక బ్రిడ్జి, రాగిమాను పల్లె దగ్గర బ్రిడ్జి, ఇలా 5 బ్రిడ్జిలు నిర్మించారు. వర్షాకాలంలో వరద ఉధృతి కి బ్రిడ్జిలు కొట్టుకొని పోయాయని అన్నారు. మాండవ్య నదిలో మూడు నదులు ఒకే చోట కలిసే మాండవ్య నదిలో ఈ రింగుల బ్రిడ్జి వర్షానికి కొట్టుకపోతుందని అన్నారు. ఇలా కొట్టుకుపోవడం వలన ప్రభుత్వ సొమ్ము వృథా అవ్వడం తప్ప ప్రయోజనం లేదన్నారు. పుల్లగూరగడ్డి దగ్గర బ్రిడ్జి నిలబడాలంటే నదిలో లోతుగా గట్టిగా వచ్చేవరకు ఇసుకను తీసి అక్కడ నుంచి కాంక్రీట్ వేసి, రింగులు వేసి, రింగు మధ్యలో పైన కాంక్రీట్ వేస్తే బ్రిడ్జి వర్షానికి తట్టుకుంటుందని అన్నారు. లేకుంటే హైవే బ్రిడ్జి కడితే వర్ష ఉధృతి నిలబడుతుందని అన్నారు. మూడు మీటర్ల లోతు తీసి కాంక్రీట్ వేసి రింగులు వేస్తే లాభం ఉండదని అంటున్నారు. స్థిరమైన బ్రిడ్జి కడితే సహకరిస్తామని లేకుంటే అడ్డుపడతామని చెప్పారు. అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై ప్రస్తుత ప్రభుత్వంతో మాట్లాడుకుని అదే డబ్బుతో పైపుల బ్రిడ్జి నిర్మించాలని చూస్తున్నారని ఆరోపించారు. కేవలం డబ్బులను దోచుక తినేందుకే ఈ విధంగా పైపులు బ్రిడ్జి నిర్మిస్తున్నారని వారు వాపోయారు. ఈ విషయంపై సంబంధిత అధికారి ఇఇతో ఫోన్ ద్వారా సంప్రదించగా 34 పైపుల నుంచి 80 పైపులు పైగా ఏర్పాటు చేసి నిర్మిస్తామని అది ఎక్కడ పోదని బ్రిడ్జి బాగుంటుందని సమాధానం చెప్పారు. అయితే ప్రజలు మాత్రం స్లాబ్ బ్రిడ్జినే మాకు నిర్మించాలని పట్టుబట్టారు. నిర్మాణం పనులు చేపట్టే కాంట్రాక్టర్ పునాదుల కోసం సక్రమంగా లోతు తీయలేదని పైపైన ఇసుక లోడి పైపులు ఏర్పాటు చేసి బ్రిడ్జి నిర్మించాలని ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టే ప్రాంతంలో మాట్లాడుతున్న ప్రజలు

నీలి నాలుక వ్యాధి నివారణకు చర్యలు

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని మట్లి పంచాయతీలో ఆసాదివాండ్లపల్లెలో 300 గొర్రెలకు బ్లూటాంగ్ వ్యాక్సిన్ శుక్రవారం వేయడం జరిగిందని వెటర్నరీ విఎల్ఒ జయప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం, శీతాకాలంలో బాహ్య పరాన్న జీవుల్లో గొర్రెల్లో, మేకల్లో, ఎక్కువగా ఈ వ్యాధి సంభవిస్తూ ఉంటుందన్నారు. ఈ కాలంలో ముఖ్యంగా సోకే వ్యాధిని నీలినాలుకవ్యాధి, బ్లూటాంగ్ వ్యాధి అంటారు. వర్షాకాలంలో దోమల తీవ్రత ఎక్కువ ఉండట వలన గొర్రెలకు, మేకలకు, సోకి ఎక్కువ గొర్రెలు చనిపోయే అవకాశం ఉందని అన్నారు.ఈ క్యూలు కాయిటీస్ దోమ కాటు వల్ల వస్తుంది. క్యులు కాయిటీస్ దోమ కాటు వలన రక్తంలో చేరి రక్త కణాలను నాశనం చేస్తాయని తెలిపారు. ఈ రక్తం విచ్ఛిన్నం కావడం, రక్తం గడ్డ కట్టకపోవడం, వలన చివరకు గొర్రెలు చనిపోతుంటాయని అన్నారు. నాలుకలోని రక్తనాళాలు వాచిపోవడం వలన, నాలుక నీలిరంగులో మారుతుందని తెలిపారు. ఈ వ్యాధి సోకినప్పుడు గొర్రెలు తీవ్రమైన జ్వరంతో బాధపడుతుంటాయని, ముక్కు నుండి నీలి జిగురు ద్రావణం కారుతుంది, కాలి గెట్టలు ఎర్రగా వాచి ఉంటాయని చెప్పారు. ఆకలి మందగిస్తుందని, వ్యాధి సోకిన గొర్రెలను మేకలను వేర్వేరుగా ఉంచాలని సూచించారు. ఆహారం త్వరగా జీర్ణమయ్యే దానికి నూకల లాంటి గంజిని ఉప్పు వేసి తాపాలని అన్నారు. ఒఆర్ఎస్ ద్రావణం కూడా ఈ వ్యాధి తగ్గేంత వరకు తాపాలని చెప్పారు. ఈ వ్యాధి నివారణ కోసం బ్లూ టాంగ్ వ్యాక్సిన్‌లు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ప్రతి సంవత్సరం నీలి నాలిక వ్యాధి రాకుండా బ్లూ టాంగ్ వ్యాక్సిన్ వేసుకున్నట్లయితే మరణాలను తగ్గించి అధిక లాభం పొందవచ్చని పేర్కొన్నారు.

గొర్రెలకు బ్లూ టాంగ్ వ్యాక్సిన్ వేస్తున్న విఎల్ఒ జయప్రకాష్

కార్మికులకు బ్యాంకుల ద్వారా జీతాలు చెల్లించాలి

పారిశుధ్య కార్మికులతో సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి రామాంజులు

ప్రజాశక్తి-గాలివీడు

గాలివీడు గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు బ్యాంకుల ద్వారా జీతాలు చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు నాణ్యమయిన పనిముట్లు అందివ్వాలని, కార్మికులకు కొబ్బరినూనె, చెప్పులు, టోపీలు, మాస్కులు, గ్లౌజులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం 11 మందితో పనిచేయించడం వలన వారి మీద తీవ్ర పనిభారం ఉందన్నారు. గాలివీడు జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు.ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు యస్.ఓబుళమ్మ, యం.లక్ష్మీదేవిలతో పాటు పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు రామచంద్ర , నరసింహులు పాల్గొన్నారు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-చెన్నూరు

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. సీజన్ వ్యాధులైన, డయేరియా, డెంగీ, మలేరియా, మెదడు వాపువ్యాధి, అతిసారా వ్యాధుల గురించి తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి శుక్రవారం ఫ్రైడే ఫ్రైడే గురించి చెన్నూరులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడి ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండేందుకు కొన్ని జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంటూ, తమ పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. భోజనానికి ముందు, మలమూత్ర విసర్జన తరువాత చేతులు శుభ్రపరచుకోవాలని తెలిపారు. అదేవిధంగా గ్రామ సమీపంలోని గ్రామాల మధ్య, ఇండ్ల వద్ద ఉన్న రోడ్లలో వర్షపునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. డయేరియా, డెంగీ, మలేరియా, బోదకాలు, మెదడువాపువ్యాధి, వంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలు డయేరియా బారిన పడకుండా రక్షించుకోవడానికి ఒఆర్ఎస్, జింక్ మాత్రలు వాడాలని అక్కడ ప్రజలకు తెలిపారు. ఏమాత్రం ఆరోగ్యం బాగా లేదన్న సూచనలు కనబడిన వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఎంఒ మనోరమ, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బి.చెన్నారెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, ఎఎంఒ వెంకటరెడ్డి, మురళి, బాల పుల్లయ్య, శంకర్‌రెడ్డి, సూపర్వైజర్‌లు రిబక, లక్ష్మీదేవి, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. **మైదుకూరు:** మైదుకూరు పట్టణంలో వైద్య అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని మైదుకూరు మున్సిపాలిటీ కమిషనర్ జబ్బర్‌మియా తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మియా, వైద్యాధికారులు, మండల విద్యాశాఖ అధికారి, సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సచివాలయ ఎఎన్ఎంలు, శానిటేషన్ సెక్రటరీలు ప్రజలందరికీ అతిసార, సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

మైదుకూరు సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ జబ్బర్‌మియా

104 వాహన సేవలు తనిఖీ

వైద్య సిబ్బందితో ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ లోక్‌వర్ధన్

ప్రజాశక్తి-కంభంవారిపల్లి

మండల పరిధిలోని గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వగళ్ళ గ్రామంలో నిర్వహించిన 104 వాహన సేవలను జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య పరికరాలను, మందుల నిల్వలను, వాహనం నిర్వహణను పరిశీలించారు. వాహన సేవలు పొందడానికి వచ్చిన వారిలో అవసరమైన వారికి ఇసిజి పరీక్ష కూడా చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ జీవనశైలి వ్యాధులకు రక్తపోటు, మధుమేహం గలవారికి 104 వాహన సేవలు ఒక వరం లాంటివని, ప్రతినెలా నియమిత తేదిన వారి గ్రామానికే వచ్చి, వారికి మందులు అందజేయడం జరుగుతుందని అన్నారు. వీలైనంత ఎక్కువ మంది సేవలు పొందేలా చూడాలని సూచించారు. సీజనల్ వ్యాధులకు అతిసార, మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వ్యాప్తి పట్ల గ్రామాలలో అవగాహన శిబిరాలు నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రాల్లో ఒఆర్ఎస్, అత్యవ సరమందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ రేష్మ, పర్యవేక్షకులు పురుషోత్తం, రుక్మిణి, ఆరోగ్య సిబ్బంది చంద్ర మైత్రి సుధా, అలేఖ్య, 104 వాహన సిబ్బంది వెంకటరమణ, ధరణి, రెడ్డి మోహన్, ఆశా కార్యకర్తలు ధనలక్ష్మి, శంకరమ్మ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ సిబ్బందిని బెదిరించలేదు

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

టిడిపి ప్రభుత్వం 2015లో మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా పని చేశారని అప్పుడు మార్కెట్ యార్డ్ ఎంతో అభివృద్ధికి కృషి చేశానని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, టిడిపి నాయకుడు తూగుట్ల రాఘవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మార్కెట్ యార్డులో పనిచేస్తున్న సిబ్బందిని బెదిరించారని చెప్పడం అవాస్తవమని, 2019లో వైసిపి ప్రభుత్వం రాగానే మార్కెట్ యార్డులో పనిచేస్తున్న సిబ్బందిని ఎంపీ అవినాష్ రెడ్డి తొలగించారని అన్నారు. మార్కెట్ యార్డ్ సెక్రటరీ రత్నరా పై కోర్టుకు వెళ్లి పరువు నష్ట దావా వేస్తామని అన్నారు. సిబ్బందిని తొలగించకుండానే తొలగిస్తున్నట్లు ఎంపీ అవినాష్ రెడ్డి ఎందుకు ఉలిక్కి పడుతున్నారో అర్థం కావడం లేదని అన్నారు. 2015లో ఇదే సిబ్బంది దొంగ బిల్లులు ఇస్తూ, దొంగ రిజిస్టర్ మైంటైన్ చేస్తూ ఉన్నప్పుడు కూడా వారిని మందలించామని చెప్పారు. నాపై అసత్యపు ఆరోపణలు చేసిన సెక్రటరీ రత్నంరాజుపై చర్యలు తీసుకునేందుకు చట్టపరంగా ముందుకు వెళతామని అన్నారు. సింహాద్రిపురంలో పనిచేస్తున్న వారిని కూడా బెదిరించినట్లు చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. తాను బెదిరించినట్లు ఆధారాలు ఉంటే చూపించాలన్నారు. ఎవరిపైనైనా ఆరోపణలు చేసేటప్పుడు ఆధారాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బాబురెడ్డి, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తూగుట్ల రాఘవరెడ్డి

కేన్సర్ బాధితుడికి చెక్కు అందజేస్తున్న వరలక్ష్మి

కేన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఓబులవారిపల్లి మండలం పెద్దఓరంపాడు పంచాయతీ, పాపిరెడ్డిపల్లిలో నివాసమున్న పాణ్యం మణి తండ్రి పాణ్యం వెంకటయ్య కేన్సర్‌తో బాధపడుతూ ఆస్పత్రి ఖర్చులకు కూడా స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కారూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి వెంటనే వారికి 25వేల చెక్కును అందించి ఆర్థిక సాయం చేశారు. అనంతరం హైదరాబాదులోని బసవతారకం కేన్సర్ ఇన్స్టిట్యూట్ యాజమాన్యంతో మాట్లాడి బాధితుడికి ఉచిత వైద్యం అందేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ అందుబాటులో ఉంటుందని అన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

-రూ.20 వేలు అందజేత

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రెడ్డిపల్లె అరుంధతివాడ గ్రామానికి చెందిన రెడ్డిపాకవెంకటేష్ గురువారం రెడ్డిపల్లి చెరువు కట్ట అలుగు వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శుక్రవారం బాధిత కుటుంబాన్ని రెడ్డిపల్లె మాజీ సర్పంచ్ రొంపిచర్ల మురళి పరామర్శించి రూ.20వేలు మృతుడి కుటుంబానికి అందించారు. అనంతరం మాజీ సర్పంచ్ మాట్లాడుతూ వెంకటేష్ కుటుంబానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలిపారు. ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా చేయడానికి ముందుంటామని పేర్కొన్నారు. వెంకటేష్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో నరసాపురం భాను, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్త్రీనిధి బకాయిలపై శ్రద్ధ పెట్టాలి

ప్రజాశక్తి-వీరబల్లి

స్త్రీనిధి రుణాల బకాయిలపై సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని స్త్రీనిధి ఎజిఎం ఉదయ్‌కుమార్ తెలిపారు.శుక్రవారం స్థానిక వెలుగు కార్యా లయంలో జరిగిన గ్రామ సమాఖ్య సిబ్బంది సమీక్షా సమావేశంలో మాట్లా డుతూ బకాయిలు ఎక్కువగా ఉండడంవల్ల కొత్త రుణాలకు అర్హత లేదన్నారు. ఏరియా కో-ఆర్డినేటర్ శ్రీనివాసులురెడ్డి మాట్లా డుతూ సభ్యులు తీసుకొన్న రుణాలను జీవనోపాదుల కల్పనకు కృషి చేయాలని అన్నారు. ఖైజర్‌ఖాన్ మా ట్లాడుతూ జాతీయ గ్రామీణ జీవనోపాదుల మిషన్ ద్వారా జీవనోపాదుల సర్వే ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలన్నారు. కార్య క్రమంలో స్థానిక ఎపిఎం ఖా దర్‌వలి, సిసిలు నాగేంద్ర, కృష్ణయ్య, శుభద్రమ్మ, గ్రామ సమాఖ్యల సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న స్త్రీ నిధి ఎజిఎం ఉదయ్‌కుమార్

క్రైం కార్నర్

వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులురెడ్డి

మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తున్న జెసిబి

రూ.2.83 లక్షల మద్యం ధ్వంసం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

డివిజన్ పరిధిలోని ఎన్నికల సమయంలో వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం, నాటుసారా ప్యాకెట్లను మద నపల్లె సమీపంలోని ఓల్డ్ బైపాస్ రోడ్డు, కనుమలో గంగమ్మ గుడి దగ్గర ఎక్సైజ్ సూపరిండెంట్ వి.శ్రీనివాసులురెడ్డి వాల్మీకి, మదనపల్లి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ జి.ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జెసిబితో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌పి కృష్ణారావు ఆదేశాల మేరకు 59 కేసుల్లో పట్టుబడ్డ రూ.2,83,050లు విలువైన 31.22 లీటర్ల మద్యం, 847.2 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మదనపల్లి వన్ టౌన్ సిఐ యు.వలీబాషా, రూరల్ సీఐ సద్గురుడు, నిమ్మనపల్లి ఎస్ఐ లోకేష్, పెద్దమండ్యం ఎస్ఐ చలపతి, ఎస్ఇబి సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి : నగదు, బంగారు చోరీ

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని టంగుటూరు గ్రామంలో వ్యక్తిపై దాడి చేసి నగదు, బంగారు చోరీ చేసిన సంఘటన ఈనెల 1న చోటు చేసుకుంది. ఈ సంఘటనపై ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ మాట్లాడుతూ పగడాల సంతోష్ అనే యువకుడు ఈనెల 1న మధ్యాహ్నం సమయంలో మునగ యానాదయ్య ఇంట్లోకి చొరబడి 57 వేల రూపాయల నగదు, రెండు తులాల బంగారు చైను చోరీ చేసి వెళుతుండగా, అడ్డుపడిన యానాదయ్యను స్క్రూ డ్రైవర్‌తో దాడి చేయగా అతనికి రక్త గాయాలయ్యాయని తెలిపారు. గాయపడిన వ్యక్తి గురువారం తమకు ఫిర్యాదు చేయగా దాడి చేసిన యువకుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-రామాపురం : రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీని మండలం బండపల్లి టోల్గేట్ వద్ద స్వాధీనం చేసుకొని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు. కడప జిల్లా ప్రొద్దుటూరు నుంచి కర్ణాటక రాష్ట్రం బంగారుపేటకు 553 బస్తాల రేషన్ బియ్యం లోడ్‌తో వెళుతున్నట్లు తెలిపారు. బండపల్లె టోల్గేట్ వద్ద ఎన్ఫోర్స్ మెంట్ అధికారులతో కలిసి లారీని స్వాధీనం తీసుకున్నట్లు చెప్పారు. స్వాధీనం చేసు కున్న రేషన్ బియ్యం బస్తాలను రాయచోటి ప్రభుత్వ రైస్ గోడౌన్ కు తరలించినట్లు ఎన్ఫోర్స్ మెంట్ అధికారులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తెలిపారు.

రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని చూపుతున్న ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి